సాక్షి
నల్లగొండ
బుధవారం, 27, డిసెంబర్, 2023



మూలమలుపుల వద్ద ప్రమాదాలు
కోదాడ – జడ్చర్ల రహదారిపై మూల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- 8లో



శోకసంద్రంలోనే తండాలు
ఒకే కుటుంబానికి చెందిన వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తండాల్లో విషాదం అలుముకుంది.
- 10లో



కాళీయమర్దనుడిగా ఊరేగి..
యాదాద్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు చిన్ని కృష్ణుడిగా, కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చారు.
- 10లో

న్యూస్‌రీల్

నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నల్లగొండ : నల్లగొండ జిల్లాలోని మైనార్టీ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టి.విజయేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పీసీఈ, సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ పోస్టుల కోసం స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల అనుభవం ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో, రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ కార్యాలయం–నల్లగొండ, హెచ్–కంప్యూటర్ ఏజెన్సీ నల్లగొండలో ఈ నెల 29తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

నల్లగొండటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి కోరారు. మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ కార్డుల పథకాలు అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో పాడిశెట్టి నాగమణి, దండెంపల్లి సత్తయ్య, బి.పార్వతి, కె.విజయలక్ష్మి, అంబటి మణెమ్మ, మణిరూప పాల్గొన్నారు.

టీఎఫ్ఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గిరిబాబు



నల్లగొండ టూటౌన్ : తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టీఎఫ్ఏ) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నల్లగొండకు చెందిన బొమ్మపాల గిరిబాబు ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో గిరిబాబును ఎన్నుకున్నారు. ప్రస్తుతం గిరిబాబు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ప్రజాపాలన సభల్లో పాల్గొంటాం

సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన సభల్లో పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా ప్రజలు అధికారం ఇస్తే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. తాము అధికారంలో లేకున్నా ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చేయని అభివృద్ధి పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లు మంత్రి కేటీఆర్ స్వేదపత్రం విడుదల చేశారని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా దత్త మహాయాగం

బొమ్మలరామారం : మండలంలోని పెద్దపర్వతాపూర్‌లో గల శ్రీ సాయిధామం సేవాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభూజీ ఆధ్వర్యంలో మంగళవారం దత్త మహాయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనం, అఖండ దీపా స్థాపనం, శ్రీగురుపూజ, గోపూజ, దత్తాత్రేయ స్వామికి పంచామృత అభిషేకాలు, హోమం తదితర పూజలు నిర్వహించారు. లోకకళ్యాణం కోసం 108 గుండాల్లో హోమం నిర్వహించినట్లు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి దుర్గానందపురి మహారాజ్ మంగళశాసనాలు అందజేశారు.

పేదల సంక్షేమమే లక్ష్యం


ప్రజా పాలన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పక్కన ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

ఆరు గ్యారంటీల అమలుకే ప్రజా పాలన
- 28వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించాలి
- సన్నాహక సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- హాజరైన మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

నల్లగొండ : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జరుగనున్న ప్రజాపాలన కార్యక్రమ సన్నాహకాల్లో భాగంగా నల్లగొండలోని ఎంఎస్ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ, వార్డు సభల సందర్భంగా ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజలు ఇచ్చే దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. దరఖాస్తులు నింపేందుకు.. స్వీకరణకు హెల్ప్ డెస్కులు, ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉంటే బృందాల సంఖ్య పెంచాలన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం : మంత్రి ఉత్తమ్

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్దేశాలను నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.పది లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు అమలు చేశామన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇచ్చే కార్యక్రమం త్వరలో మొదలు పెడతామన్నారు. ప్రజా పాలనలో స్వీకరించే దరఖాస్తుల ఆధారంగానే ఆరు గ్యారంటీల అమలు అవుతాయని చెప్పారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖలో జిల్లాకు అన్యాయం జరిగిందని పదేళ్లలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీరందలేదన్నారు. ఈ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తుందన్నారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్ మాఫియాను కఠినంగా శిక్షిస్తామన్నారు. రేషన్ సరఫరాను ప్రక్షాళన చేస్తామన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో పాలు పంచుకోవాలి : మంత్రి కోమటిరెడ్డి

రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాలసీలను పేదలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. ప్రజాపాలన సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా టెంట్లు, మంచినీటి సౌకర్యం, కుర్చీలు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి తెలంగాణ పునర్నిర్మాణంలో పాలు పంచుకోవాలన్నారు. బెల్టుషాపులు, గంజాయి అమ్మకాలపై పోలీసులు శ్రద్ధ పెట్టాలని, ఇసుక, గంజాయి, వైన్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జరిగే ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి గ్రామాలు, పట్టణాల్లో 151 బృందాలను ఏర్పాటు చేశామని, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్.ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో 58 టీమ్‌లు ఏర్పాటు చేసామని, దరఖాస్తుల స్వీకరణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ జిల్లాలో పక్కా ఏర్పాట్లతో ప్రజా పాలన విజయవంతానికి సిద్ధంగా ఉన్నామని, మొత్తం 51 టీమ్‌లతో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, నలమాద పద్మావతి, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్ర, సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, భాస్కర్‌రావు, వెంకట్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజా పాలన సన్నాహక సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నల్లగొండ : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం నల్లగొండ మున్సిపాలిటీలో ప్రారంభం కానుంది. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని గడియారం సెంటర్‌లో యాత్ర ప్రారంభమవుతుందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి టి.శ్రామిక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆధార్ కార్డులు, ఇతర కేంద్ర పథకాల మంజూరు ఉంటుందని వెల్లడించారు. అర్హులైన వారంతా తగిన పత్రాలతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ యాత్ర నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజులు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

కొత్త ఆశల్లో ఏఎమ్మార్పీ రైతాంగం

- కాల్వల మరమ్మతుకు మోక్షం కలుగుతుందని ఆశాభావం
- ప్రధాన కాల్వ విస్తరణ, లైనింగ్‌పై అధికారులు దృష్టి
- అంచనాలు రూపొందించేందుకు సిద్ధం కావాలని ఆదేశాలు
- లైనింగ్ ఉంటే పూర్తి సామర్థ్యం మేరకు నీరు వదిలేందుకు అవకాశం


గుర్రంపోడు వద్ద దెబ్బతిన్న ప్రధాన కాల్వ

గుర్రంపోడు : దశాబ్దాలుగా కనీస మరమ్మతులకు నోచుకోని ఏఎమ్మార్పీ కాల్వలు కొత్త ప్రభుత్వంలో మోక్షం లభిస్తుందనే ఆశలో ఆయకట్టు రైతాంగం ఉంది. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులు, కాల్వలను పూర్తి చేయడంలో అధిక ప్రాధాన్యం ఇస్తానని, ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేస్తామని ప్రకటించడంతో ఆయకట్టు రైతాంగంలో కొత్త ఆశలు చిగురించాయి. సొరంగమార్గం ద్వారా గ్రావిటీ ద్వారా కాల్వలో పూర్తి సామర్థ్యం మేరకు నీరు ప్రవహించాలంటే ప్రధాన కాల్వ విస్తరణతోపాటు లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

93 కిలోమీటర్ల పొడవునా ప్రధాన కాల్వకు లైనింగ్

టన్నల్ పూర్తయితే కృష్ణా జలాలు నేరుగా ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 23వ కిలోమీటర్ వద్ద ప్రవేశించి వంద కిలోమీటర్ల పొడవునా ప్రవహించి ఉదయ సముద్రానికి చేరుకుంటాయి. ఇది మొత్తం 77 కిలోమీటర్లు ఉండగా ఉదయ సముద్రం తర్వాత మూసీ వరకు గల 36 కిలోమీటర్లలో 16 కిలోమీటర్ల వరకు మొత్తం 93 కిలోమీటర్లు కాల్వ విస్తరణకు అవకాశం ఉంది.

ప్రస్తుతం పారేది సగం నీరే..

ఏఎమ్మార్పీ కింద 130 కిలోమీటర్ల ప్రధాన కాలువతోపాటు 250 కిలోమీటర్ల పొడవునా మేజర్ కాలువలు ఉన్నాయి. మూడు వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం ప్రవహించేలా ప్రధాన కాల్వను డిజైన్ చేయగా దశాబ్దాలు మరమ్మతులకు నోచుకోకపోవడం, పూడిక కారణంగా ప్రస్తుతం 1500 క్యూసెక్కులకు మించి నీటి వదిలే పరిస్థితి లేదు. ఇంతకు మించి నీరు వదిలితే ఎక్కడైనా కాల్వ తెగే ప్రమాదం ఉన్నందున సాగర్‌లో పుష్కలంగా నీరు ఉన్న పూర్తి సమయంలో కూడా పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు నీటిని వదలడం లేదు. టన్నెల్ పూర్తయి పూర్తిస్థాయిలో నీరు వస్తే కాల్వలను తప్పనిసరిగా మరమ్మతు చేయాల్సి వస్తుంది.

గతంలోనే ప్రతిపాదనలు..

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ కోసం అప్పట్లో రూ.250 కోట్లతో అధికారులు లైనింగ్ అంచనాలు రూపొందించారు. ఆ తర్వాత కాలంలోనూ రూ.600 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ విస్తరణ, లైనింగ్ పనులకు ప్రతిపాదలను సిద్ధం చేయాలంటూ త్వరలోనే ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి సూచనలు వచ్చినట్లు ఒక అధికారి పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.వెయ్యి కోట్ల వరకు అంచనా వ్యయం ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి

నల్లగొండ టూటౌన్: పార్లమెంటు ఎన్నికలకు కార్యకర్తలందరూ సమాయత్తం కావాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఆర్. ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా ఓట్ల శాతం పెరిగిందన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండార్ ప్రసాద్, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాలకూరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

సమగ్ర చట్టం రూపొందించాలి

నల్లగొండటౌన్: హమాలీలకు సమగ్ర చట్టం రూపొందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, ఏఐటీయూసీ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం సంఘం జిల్లా కార్యాలయంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్, సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రేషన్ షాపులకు బియ్యం దిగుమతి హమాలీ రేట్లు రూ.8 నుంచి రూ.12 పెరిగినట్లు తెలిపారు. రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్లు పెరిగేవిధంగా ఒప్పందాన్ని డీలర్లు అంగీకరించారని పేర్కొన్నారు. హమాలీలకు బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, కోటగిరి సూర్యనారాయణ, పులిచింతల సత్తిరెడ్డి కొర్రా శంకర్ నాయక్, దొనకొండ వెంకటేశ్వర్లు, మహేష్, శ్రీను, భద్రయ్య, సత్యం, రాము, మధు, బుచ్చయ్య అశోక్, శ్రీశైలం, పుల్లారావు కొండల్, కోటేశ్వర్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కలిసిరాని కాలం

- అనావృష్టి, అకాల వర్షాలతో పంటలకు నష్టం
- రుణమాఫీ, రైతుబంధు అందక రైతుల ఇబ్బందులు
- సగానికి తగ్గిన పత్తి దిగుబడి
- ఏడాదంతా ఒడిదుడుకుల మధ్య సాగిన సాగు


వర్షాభావంతో ఎండిపోయిన పత్తి చేను (ఫైల్)

2023 రివైండ్

పంటల సాగు.. దిగుబడి ఇలా..

గత యాసంగిలో వరి సాగు 4,64,840 ఎకరాలు	ధాన్యం దిగుబడి 13,72,706 మెట్రిక్ టన్నుల
వానాకాలంలో వరి సాగు 4,08,172 ఎకరాలు	ధాన్యం దిగుబడి 12,27,308 మెట్రిక్ టన్నులు
పత్తి సాగు 5,82,801 ఎకరాలు	పత్తి దిగుబడి 23,31,204 క్వింటాళ్లు

నల్లగొండ అగ్రికల్చర్ : 2023 సంవత్సరం రైతులకు కలిసిరాలేదు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య రైతులు వివిధ పంటలు సాగు చేసినా అనావృష్టితో పాటు అకాల వర్షాల కారణంగా నష్టపోయారు. వరి పంటలు కోత దశలో తుపానుల కారణంగా ధాన్యం మొలకెత్తాయి.. జిల్లాలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పూత, కాయ దశలో సరైన వర్షాల లేక పత్తి దిగుబడి సగానికి పడిపోయి నష్టపోయారు. ఇక, నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో వానాకాలం, ప్రస్తుత యాసంగి సీజన్‌కు నీటి విడుదల లేకపోవడంతో సగానికి పైగా భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. బోర్లు, బావుల ఆధారంగా రైతులు కొంత సాగు చేస్తున్నారు.

ఈ ఏడాదిలో సాగు ఇలా..

- గత యాసంగి సీజన్‌లో 4,64,840 ఎకరాలలో వరి సాగు చేశారు. కంది, పెసర తదితర పంటలను సాగు చేసినప్పటికి పెద్దగా దిగుబడి రాలేదు. అప్పటి ప్రభుత్వం రుణమాఫీ హామీని అమలు చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వలేదు. దీంతో ఎరువులు, విత్తనాలు, దున్నకాలు, ఇతర పెట్టుబడుల కోసం రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించారు. తీరా పంట కోతకు వచ్చే సమయంలో ఏప్రిల్, మార్చి నెలల్లో కురిసిన అకాల వర్షాలతో సుమారు 10 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ధాన్యం అమ్మకానికి కేంద్రాలకు తరలించిన ధాన్యం సైతం అకాల వర్షంతో తడిసి రైతులు మరింత నష్టపోయారు. ధాన్యం అమ్మిన డబ్బులు సకాలంలో అందలేదు.
- వానాకాలం సీజన్‌లో సకాలంలో నైరుతి రుతుపవనాలు జిల్లాకు రాకపోవడంతో సీజన్ ఆరంభంలో వర్షాలు కురవలేదు. రైతులు పత్తి విత్తనాలను విత్తుకున్నా.. వర్షాలు రాకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో రైతులు రెండోసారి విత్తనాలు పెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో వారిపై అదనపు భారం పడింది. జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 5,82,801 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. తీరా పూత, కాత దశకు వచ్చే సమయంలో వానలు రాకపోవడంతో చేలు వాడుముఖం పట్టాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో తుపాన్ రావడంతో పత్తి చేలకు ప్రాణం పోసింది. అయినా చేలపై ఉన్న పత్తి కాయలు దెబ్బతిని దిగుబడి సగానికి పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా 23,31,204 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. క్వింటాకు రూ.7 వేలకు మించి ధర రాకపోవడంతో రైతులు పెట్టుబడులు కూడా మీదపడి నష్టపోయారు. సీజన్‌లో వరి 4,08,172 ఎకరాల్లో సాగు చేశారు. అందులో సన్నరకం ధాన్యం 1,48,587 ఎకరాల్లో సాగు చేయడంతో ఆ ధాన్యాన్ని క్వింటాకు రూ.2700 చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేయడంతో రైతులకు కొంత కలిసి వచ్చింది.
- ప్రస్తుత యాసంగి సీజన్‌లో పంటల సాగు నత్తనడకన సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 5.51 లక్షల ఎకరాల్లో వరి, కంది, పెసర పంటలు సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. భూగర్భజలాలు అడుగంటడంతో పాటు ఆయకట్టుకు సాగునీటి విడుదల లేని కారణంగా సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా కేవలం 25 వేల ఎకరాల్లోనే వరి నాట్లు వేసుకున్నారు. లక్షన్నర ఎకరాల్లో వరి నార్లు పోసుకుని నాటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వేరుశనగ 11,641 ఎకరాల్లో, పెసర 68 ఎకరాల్లో సాగు చేసుకున్నారు. మొత్తం మీద ఈ యాసంగిలో సాగు వ్యవసాయ శాఖ అంచనా వేసిన దాంట్లో సగం కూడా సాగయ్యే పరిస్థితి కనబడడం లేదు.

సకాలంలో అందని రుణమాఫీ

గత ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రైతుల రుణాలను సకాలంలో మాఫీ చేయకపోవడంతో రైతులు తీసుకున్న రుణానికి వడ్డీలు పెరిగి నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 3,00,760 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా బ్యాంకర్లు పంపించినా.. ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయలేదు. వివిధ సాంకేతిక కారణాలు చూపుతూ జిల్లాలో 829 మంది రైతులకు రూ.4 కోట్ల 93 లక్షలు మాఫీ కాలేదు.

యాసంగిలో అందరికీ అందని రైతుబంధు..

ప్రస్తుతం యాసంగి సీజన్ పెట్టుబడి సాయం ఇప్పటి వరకు ఎకరంలోపు ఉన్న లక్ష మంది రైతులకు మాత్రమే అందాయి. బ్యాంకుల్లో జమచేసే ప్రక్రియ ప్రారంభమై 15 రోజులు గడస్తున్నప్పటికీ డబ్బులు పడక రైతులు పెట్టుబడల కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం అసలు రైతుబంధు ఇస్తుందా.. ఇవ్వదా..? అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.


త్రిపురారం మండలంలో బీడుగా ఉన్న భూమి

రెండు పంటలకు నీళ్లు లేవు



నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు సాగు నీరు ఇవ్వలేదు. దీంతో కేవలం బోరు ఉన్న వాళ్లు మాత్రమే కొంత వరిసాగు చేస్తున్నారు. ఈ ఏడాది మాకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.
– కుందనపల్లి చెన్నయ్య, త్రిపురారం

బోరుకింద నాట్లు వేసుకున్నాం



సాగునీటి విడుదల లేకపోవడంతో బోర్ల కింద వరిసాగు చేసుకుంటున్నాం. మెట్టపంటలు వేసుకోవాలన్నా నీళ్లు లేవు. తీరా పంట చేతికి వచ్చే వరకు బోర్లు నీళ్లు పోస్తాయో లేదోనని భయంగా ఉంది. వర్షాలు మంచిగా కురిస్తే సాగర్ నిండి సాగునీరు వచ్చేది. నీళ్లు లేక తీవ్రంగా నష్టపోతున్నాం.
బాల్తి సత్యనారాయణ, బెజ్జికల్, త్రిపురారం మండలం

క్లుప్తంగా

వివిధ కేసుల్లో పలువురికి జరిమానా

హుజూర్‌నగర్ : మద్యం సేవించి వాహనాలు నడపడం.. పేకాడ ఆడుతూ పోలీసులకు పట్టుబడం.. ఘర్షణలు తదితర కేసుల్లో పలువురికి రూ.70,500ల జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఒక్క రోజులోనే 60 కేసుల్లోని నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వారు తమ నేరాలను అంగీకరించడంతో న్యాయమూర్తి జరిమానా విధించారు. జరిమానా డబ్బులు ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని జడ్జి తీర్పుల్లో పేర్కొన్నారు.




నల్లగొండలో జరిగిన ప్రజాపాలన సన్నాహక సమావేశానికి వచ్చిన జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు స్వాగతం పలుకుతున్న నల్లగొండ ఇంచార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, సూర్యాపేట ఇంచార్జి కలెక్టర్ ప్రియాంక



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



హాజరైన ఎమ్మెల్యేలు జయవీర్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, బీఎల్ఆర్, బాలునాయక్, వేముల వీరేశం తదితరులు




జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాటామంతి

మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు

- నిడమనూరు మండలంలో 8 కి.మీ దూరంలోనే 9మలుపులు
- రహదారిని విస్తరించినా ఆగని ప్రమాదాలు
- పుష్కర కాలం క్రితం బొక్కమంతులపహాడ్ సమీపంలో 14మంది బలి
- తాజాగా ఆరుగురి మృతితో హడలిపోతున్న ప్రయాణికులు

నిడమనూరు : రహదారి మూలమలుపులు ప్రయాణికులను కబళించేస్తున్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో కేంద్ర ప్రభుత్వం కోదాడ–జడ్చర్ల రోడ్డును జాతీయ రహదారి–167గా అభివృద్ధి చేసింది. అయినా, ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. నిడమనూరు మండలం మీదుగా వెళ్లే ఈ రహదారిపై కేవలం 8 కి.మీ దూరంలోనే ఉన్న బొక్కమంతులపహాడ్–వేంపాడ్–వెంగన్నగూడెం స్టేజీల మధ్య 9 మూలమలుపులు ఉన్నాయి. తాజాగా, మండలంలోని వేంపాడ్, మూడో నంబర్ కెనాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలతో ఈ రహదారి గుండా వాహనదారులు ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు.

పుష్కర కాలం క్రితం 14మంది మృతి..

» 2012 జూలై 24న దేవరకొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న లారీ నిడమనూరు మండలంలోని బొక్కమంతులపహాడ్ సమీపంలో జీవాలను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో 14మంది మృతిచెందగా మరో 23మంది గాయపడ్డారు.

» బొక్కమంతులపహాడ్ సమీపంలోనే గతంలో మిర్యాలగూడ నుంచి దేవరకొండ వైపు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో జీవాలను కొని విక్రయించే వ్యాపారులు ఆరుగురు సిమెంట్ బస్తాల కింద పడి విగతజీవులుగా మారారు.

» 1997లో వేంపాడ్ స్టేజీ సమీపంలో మూలమలుపు వద్ద ఖమ్మం నుంచి సాగర్‌కు వెళ్తున్న స్కూల్ పిల్లల జీపును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టిన ఘటనలో నలుగురు బాలికలు మృతిచెందగా మరికొంత మంది గాయాలపాలయ్యారు.



బొక్కమంతులపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు (ఫైల్)

» అంతేకాకుండా ఇదే రోడ్డులో గతంలో ఇరుకు వంతెనలు, రోడ్డుపై వాహనాల రద్దీ కారణంగా ఒకరిద్దరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఘటనలు అధికంగానే ఉన్నాయి.

కొన్ని చోట్ల డివైడర్లు లేక..

కేంద్ర ప్రభుత్వం కోదాడ–జడ్చర్ల రోడ్డును జాతీయ రహదారి–167గా అభివృద్ధి చేసింది. రోడ్డు విశాలంగా ఉందని వాహనదారులు స్పీడుగా వెళ్తుండడం, కొన్ని చోట్ల డివైడర్లు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున వేంపాడ్ స్టేజీ వద్ద, మూడో నంబర్ కెనాల్ సమీపంలో రోడ్డుపై డివైడర్లు లేకపోవడంతోనే ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తోంది. రోడ్డుకు ఇరువైపులా గ్రామాలు ఉన్న చోట డివైడర్లు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల గ్రామాలు రోడ్డుకు దూరంగా ఉండడంతో డివైడర్లను ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారి కావడం వల్ల ప్రమాదాలు జరిగిన చోట్లలో రోడ్డుపై ఎలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయలేమని పోలీసులు చెబుతున్నారు.

'వెంకటయ్య బావి' నవల ఆవిష్కరణ



వెంకటయ్య బావి నవలను ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

హైదరాబాద్(లక్డీకాపూల్): వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించి మాట్లాడారు. దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్‌కుమార్ డబ్బీకార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడరూరల్ : తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీమన్నారాయణ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీలో నివాసం ఉండే మిర్యాల నాగేశ్వరరావు ఈ నెల 23న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి జగ్గయ్యపేట బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చేసేవరకు తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారం, రూ.2.50లక్షల నగదు మాయమైనట్లు గుర్తించారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన చేపల వల

- చెరువులో కాళ్లకు వల చిక్కుకోవడంతో నీటమునిగి మృతి



శ్రీ రాములు (ఫైల్)

వలిగొండ : చేపల వల ఓ వ్యక్తి ప్రాణం తీసింది. చెరువులో చేపలు పడుతుండగా ప్రమావశాత్తు కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. వలిగొండ మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన పబ్బు శ్రీరాములు (65) వృత్తి రీత్యా చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గ్రామంలోని మల్లసముద్రం కుంటలో చేపల పట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు మల్లసముద్రం పరిసరాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మల్లసముద్రం కుంటకు వెళ్లి అందులో వేసి ఉన్న వలను లాగడంతో శ్రీరాములు విగతజీవుడిగా కనిపించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

లునారెస్ అనలాగ్ ఆస్ట్రోనాట్ మిషన్‌కు ఎంపిక



మోహనసాయి

హుజూర్‌నగర్: పోలాండ్ దేశంలో జరిగే లునారెస్ అనలాగ్ ఆస్ట్రోనాట్ మిషన్‌కు భారతదేశం తరపున హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఆకుల మోహనసాయి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం మోహనసాయి విలేకరులతో మాట్లాడుతూ.. లునారెస్ రీసెర్చ్ స్టేషన్ అనేది పోలాండ్‌లోని పోస్ట్ మిలిటరీ విమానాశ్రయంలో ఉందని, ఈ స్టేషన్‌లో అనలాగ్ ఆస్ట్రోనాట్లు బాహ్య ప్రపంచం నుంచి పూర్తిగా వేరు చేయబడతారని, ఛాంబర్ లోపల 15రోజుల పాటు వారి శరీర ధర్మం, మనస్తత్వ శాస్త్రం, మరికొన్ని సాంకేతిక పరీక్షలను నిశితంగా పరిశీలిస్తారని తెలిపాడు. మోహనసాయి ముంబైలోని అమిటీ యూనివర్సిటీలో మాస్టర్స్ (ఆస్ట్రోబయాలజీ అండ్ స్పేస్ సైన్స్) చదువుతున్నాడు. భారతదేశంలోనే ఈ కోర్సును తొలిసారిగా 2023లో ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి ఫస్ట్ బ్యాచ్‌లో 9మంది విద్యార్థులు ఉండగా.. తెలంగాణ నుంచి మోహనసాయి మాత్రమే ఉన్నారు. ఇలాంటి ఆస్ట్రోనాట్ మిషన్లలో పాల్గొంటున్న తనకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆర్థికసాయం అందించాలని మోహనసాయి కోరుతున్నాడు. మోహనసాయి ఎంపిక పట్ల తల్లిదండ్రులు శ్రీనివాస్ నాగజ్యోతి, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెడికో మృతి



సాయితేజ (ఫైల్)

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెడికో మృతిచెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన బిరుదు సాయితేజ(20) నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో బీడీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయితేజ తనతో కలిసి చదువుకుంటున్న యశస్వీతో కలిసి సోమవారం ఉదయం బైక్‌పై యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి వెళ్లి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో చిట్యాల వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను భువనగిరి వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా పడిన సాయితేజ, యశస్విని పోలీసులు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. సాయితేజ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం

నల్లగొండ క్రైం : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్‌కు చెందిన లోకనబోయిన భిక్షపతి(56) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సోదరుల మధ్య 70గుంటల భూమి విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన భిక్షపతి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బయటికి వెళ్లిన భార్య పద్మ కాసేపటికి తిరిగి రాగా భిక్షపతి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో ఆమె ఇరుగు పొరుగు వారి సహాయంతో భిక్షపతిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వివరాలు లభ్యం

- మృతుడు భువనగిరిలోని హనుమాన్ వాడ వాసి

భువనగిరి క్రైం : మండల పరిధిలోని భువనగిరి–పగిడిపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలపై సోమవారం లభ్యమైన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వివరాలు తెలిశాయి. మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా భువనగిరి పట్టణంలోని హనుమాన్ వాడ వాసి గంగబోయిన మల్లయ్య(55)గా గుర్తించారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే మల్లయ్య కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తీసుకున్న అప్పులు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో మద్యానికి బానిసగా మారాడు. అప్పుల బాధతోనే గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.